శ్రావణం... శుభప్రదం

- శ్రావణమాసంలో అన్నీ ముఖ్యమైన పండుగలు
- ఆలయాలు, ఇళ్లలోనూ భక్తి పారవశ్యం
- ప్రతీ శుక్రవారం ప్రత్యేకమే



ప్రత్యేక అలంకరణలో భోగేశ్వరుడు



భోగేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

గడివేముల: హిందువులకు ఎంతో పవిత్రమైంది శ్రావణ మాసం. సోమవారం శ్రావణ మాసం ప్రారంభమవ్వగా ఆలయాలతోపాటు ఇళ్లలోనూ భక్తి పారవశ్యం నెలకొంది. ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు, నోములు శుభ ఫలితాలను ఇస్తాయని భక్తుల విశ్వాసం. ప్రతీ ఇళ్లు ఆలయాన్ని తలపిస్తుంది. ఇదే నెలలో వరలక్ష్మీ వ్రతం, మంగళగౌరీ వ్రతం, నాగ పంచమి, రాఖీ పౌర్ణమి వంటి ముఖ్యమైన పండుగలు రావడంతో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల రోజుల పాటు ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటుంది. హరిహర నామస్మరణతో ఆలయాలు మారుమోగుతున్నాయి. పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణా నక్షత్రం మీద సంచరించడంతో ఈ మాసానికి శ్రావణం అనే పేరు వచ్చింది. ఈ నెలలో వచ్చే శుక్రవారాలు వ్రతాలు, నోములు ఆచరిస్తారు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి నక్షత్రం కూడా శ్రవణమే కావడంతో ఆయన భార్య లక్ష్మీదేవికి, సోదరి గౌరీదేవికి శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ప్రత్యేకంగా వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తారు. మండల కేంద్రం గడివేముల సమీపాన వెలిసిన భోగేశ్వరాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నోముల మాసం

పురోహితులు శ్రావణ నోముల మాసంగా లెక్కిస్తారు. శ్రావణంలో మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మి వ్రతాలను ఆచరిస్తారు. ఈ మాసంలో వచ్చే ఏ మంగళవారం అయినా మంగళగౌరీ వ్రతాన్ని చేయొచ్చు. ఈ వ్రతాన్ని యువతులు పెళ్లైన తర్వాత ఏడాది వరకు ఆచరిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని జీవితాంతం ఆచరిస్తారు. అయితే ఈ రెండు వ్రతాలు నిర్వహించే విధానం వేర్వేరుగా ఉంటాయి.

ఈ మాసంలో ముఖ్యమైన పండుగలు

శ్రావణ మాసంలో పండుగల సందడి ఉంటుంది. ఈ నెల 9న తొలి శుక్రవారం, 11న భానుసప్తమి, 16న రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పండగలు ఉన్నాయి. శ్రావణ మాసం తరువాత వచ్చే భాద్రపద మాసంలో వినాయక చవితి సందడి మొదలవుతుంది.

30 రోజుల్లో 11 ముహూర్తాలు

శుక్ర మౌఢ్యం, ఆషాడ మాసంతో 100 రోజుల బ్రేక్ తర్వాత ఈనెల 7 నుంచి 28 వరకు 11 పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణం మాసంలో వ్రతాలతో పాటు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలకు మంచిదని ప్రజల నమ్మకం. ముఖ్యంగా 20, 7,8,9, 11,15,17,18,19,22,23,28 తేదీలో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు అంటున్నారు.

వ్రతాలు ఆరోగ్యానికి మేలు....

పూజలు, వ్రతాలు, నోముల ఆచరించడంలో ఆరోగ్యపరమైన కారణాలు చాలా ఉన్నాయి. వర లక్ష్మి వ్రతం రోజు వాయనంగా ఇచ్చే మొలకెత్తిన శనగలు పోషక నిలయాలు. వీటిలో మాంసకత్తులు తక్షణ శక్తిని ఇస్తాయి. నైవేద్యంగా ఆరగించే చలివిడి చలువనిస్తుంది. చలివిడి గర్భాధారణ అవ రోధాలను తొలగిస్తుంది. అలాగే వర్షకాలం పాదాలు ఎక్కువ సేపు తడిగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ కలుగుతుంటాయి. ఇలా ఇన్ఫెక్షన్‌కు గురవ్వకుండా ఉండటం కోసమే కాళ్లకు పసుపు పూసుకోవటాన్ని ఈ వ్రతాల్లో భాగం చేస్తారు. ఆవు నెయ్యితో వెలిగించే దీపాల ద్వారా విడుదలయ్యే ధూపం వాయుకాలుష్యాన్ని హరిస్తుంది.

శ్రావణానికి ప్రాధాన్యం



సకల సుఖాలను నొసగే శ్రావణం జ్ఞానాన్ని అందిస్తుంది. హరిహర భేదంలేదని నిరూపించే శ్రావణమాసంలో వైష్ణవారాధనతోపాటు మహాశివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. భోగేశ్వరాలయంలో ప్రతి రోజులు లలితా, శివ సహస్రనామ పారాయములు జరుగును. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– శ్యామ్‌సుందర్‌శర్మ, ఆలయ అర్చకులు, భోగేశ్వరాలయం

క్లుప్తంగా

భగవద్గీతపై ప్రచారం



గడివేములలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

గడివేముల: మండల కేంద్రం గడివేములలోని పెద్దమ్మ ఆలయ ప్రాంత ప్రజలకు త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై త్రైత సిద్ధాంత ప్రభోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు రామచంద్రుడు, సభ్యులు అవగాహన కల్పించారు. భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారు భగవద్గీత గ్రంథాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంజీవ, నాగమద్దిలేటి, శీను, కుమార్ అచారి, సుజాతమ్మ, పుల్లారెడ్డి, వరలక్ష్మమ్మ తదతరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



కర్నూలుకు వెళ్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

కోడుమూరు రూరల్: హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి హెచ్చరించారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాకు మంగళవారం కోడుమూరు నుంచి విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అవసరమైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సగానికి పైగా హాస్టళ్లు శిథిలావస్థకు చేరడంతో పాటు, విద్యార్థులకు సరిపోయేనన్ని గదులు, బాత్‌రూమ్‌లు లేవన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



పోలకల్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను బాధ్యతగా పాటించాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. మండల పరిధిలోని కంబదహాల్, సి.బెళగల్, పోలకల్ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈఓఆర్డీ ప్రజలతో మాట్లాడుతూ వాటర్ ట్యాంక్‌లు, దోమల నివారణ మందు పిచికారీని పరిశీలించిన ఈఓఆర్డీ సీజనల్ వ్యాధులు సోకకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలని సర్పంచ్‌లకు సూచించారు.

ఓడీఎఫ్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



మహిళతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: ఓడీఎఫ్ ప్లస్ (వ్యక్తిగత మరుగదొడ్ల) సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ శకుంతల సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండల పరిధిలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లో జరగుతున్న సర్వేను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలో 12,214 ఇళ్లలో సర్వే నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటికే 9,879 ఇళ్లలో పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం ఇనగండ్ల గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా రైతులు సాగు చేసుకుంటున్న ఉద్యాన వన పంటలను పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ సుమంత్

సి.బెళగల్: ప్రభుత్వాలు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ సుమంత్ సూచించారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న వెంటనే బిల్లులను అందజేయడం జరుగుతుందన్నారు. హౌసింగ్ కాలనీలో 34 మంది లబ్ధిదారులు ఉండగా, 12 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్నారని, మరో 22 గృహాలు వివిధ దశలలో ఉన్నాయని ఏఈ తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ విరాళం



మైక్ సెట్‌ను అందజేసిన పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు జెడ్పీహెచ్‌సీ పూర్వ విద్యార్థులు (1992–93 పదవ తరగతి బ్యాచ్) పాఠశాలకు మైక్‌సెట్‌ను విరాళం ఇచ్చారు. మంగళవారం మైక్‌సెట్‌ను హెచ్‌ఎం రామచంద్రారెడ్డికి అందజేశారు. స్కూల్ అభివృద్ధికి సహకారం అందజేసిన పూర్వ విద్యార్థులకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపికృష్ణ, రఫీక్, నాగభూషణం, రాముడు, సరోజమ్మ,అంబాభవాని తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్ఎన్ రమణమ్మ

ఓర్వకల్లు: పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాపించడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాల వారోత్సవంలో భాగంగా ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రమణమ్మ, ఎంపీహెచ్ఎస్ రాబర్ట్, ఎంపీహెచ్ఓ ప్రకాష్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్ష, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సతీష్

కోడుమూరు రూరల్: కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఎవ్వరూ అధైర్య పడొద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ తెలిపారు. జూన్ 7వతేదీ టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన కోడుమూరు మండలంలోని కొత్తపల్లెకు చెందిన చిన్న మద్ది, కేశవులు, కృష్ణకు మంగళవారం కర్నూలులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్‌తో కలిసి ఆమె బాధితులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటున్నారన్నారు. టీడీపీ నేతల దాడుల్లో గాయపడిన కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీ తరపున రూ.50వేల చొప్పున ముగ్గురికి ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. దాడులను ఆపకపోతే ప్రజలే కూటమి నేతలకు తగిన బుద్ధి చెబుతారన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



గుండ్రేవులలో జీపీపీ సాగును ప్రారంభిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు వరి పంటల సాగులో మెలుకువలను పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండలం పరిధిలోని గుండ్రేవుల, కొండాపుర గ్రామాలలో గ్యాప్ (జీఏపీ – గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా ఏఈఓ సిద్ధు, సిబ్బంది వరి పొల్లాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి పంట సాగు విధానంపై అవగాహన కల్పించారు. పెట్టు బడిలేని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు, వ్యవసాయ సిబ్బంది రైతులతో కలిసి పొలాల్లో వరి నాటు వేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు వెంకటేష్, సోమేశ్వరి, వీఏఏ నాయక్, జెడ్‌బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రాధాకృష్ణారెడ్డి

కల్లూరు: సబ్సిడీపై అందజేసే సూక్ష్మ, తుంపర సేద్యం పరికారలను రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఏపీడీ రాధాకృష్ణరెడ్డి తెలిపారు. కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బీఆర్వోలు, వీఏఏ, వీహెచ్‌లతో నిర్వహించిన సమావేశంలో ఏపీడీ మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 15వేల ఎకరాలకు సూక్ష్మ (డ్రిప్), తుంపర (స్పింకర్లు) సేద్యం పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. సూక్ష్మ సేద్యం పరికరాలు ఐదు ఎకరాలలోపు రైతులకు 90శాతం సబ్సిడీ, ఐదు ఎకరాల పైన ఉంటే 70శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. అదేవిధంగా తుంపర సేద్యపు పరికరాలు ఐదు ఎకరాల లోపు రైతులకు 55శాతం సబ్సిడీ, ఐదు ఎకరాలపైన ఉన్న రైతులకు 45శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల చివరకు ఈ పంట నమోదు పూర్తి చేయాలన్నారు. కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే గద్దె దింపుతాం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నాయకులు, విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఇంటికి పంపుతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాషా హెచ్చరించారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్దఎత్తున విద్యార్థులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. ముందుగా సీఆర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 76 హాస్టళ్లు ఉంటే దాదాపు 70 శాతం హాస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవన్నారు. చాలా హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని వివరించారు. వెంటనే నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని కోరారు. కొన్ని హాస్టళ్లలో విద్యార్థులు పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వార్డెన్, ఇతర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, స్కూళ్లలో ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కారుణ్య నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంటుగా పనిచేస్తూ గుండెపోటుతో మరణించిన తిరుమలరావు కుమార్తె దీప్తికి జూనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగం లభించింది. 2023 సెప్టెంబరు 1న తిరుమల రావు మరణించారు. అయితే ఆయన కూతురు దీప్తికి ఉద్యోగం ఇవ్వడానికి అర్హత వయస్సు లేకపోవడంతో కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం అర్హత వయస్సు రావడంతో కారుణ్యం కింద జూనియర్ అకౌంటెంట్‌గా నియమిస్తూ జిల్లా ట్రెజరీ ఇన్‌చార్జ్ అధికారి జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వు కాపీని దీప్తికి అందజేశారు. ఎస్‌టీఓ పలనాటి సునీల్ ఉన్నారు.

దుకాణదారులు శుభ్రత పాటించాలి

కర్నూలు (టౌన్): నగరంలో దుకాణదారులు షాపు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, జీఎస్ఆర్ నగర్, లక్ష్మీనగర్ తదితర కాలనీలలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కొందరు దుకాణదారులు పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకోవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగే వ్యవహరిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు రమేష్‌బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కర్నూలు (లీగల్): స్థానిక టౌన్ మోడల్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, డీసీపీయూ శారద అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టం ప్రకారం శిక్ష పడుతుందన్నారు. విద్యాహక్కు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, దేశభక్తిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు.టౌన్ మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లబ్‌ను కూడా తనిఖీ చేశారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్): కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్ చెప్పారు. బాలసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మునగాలపాడు గ్రామంలోని బాలసాయి కంటి వైద్యశాల ఆవరణలో ట్రస్ట్ మేనేజర్ రామారావు సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ.. మన శరీరంలో అతి ముఖ్యమైన భాగమైన కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, కంటి సమస్యలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బాలీశ్వరయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్, ఆర్‌ఎంపీ మద్దయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలపై మంత్రికి వినతి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి టీజీ భరత్‌ను కలసి తమ సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, ప్రధాన కార్యదర్శి రవికాంత్, మురళి, మోహన్ బాబు, వెంకట్రావు, షాబుద్దీన్, సుమన రాణి తదితరులు వినతిపత్రం ఇచ్చారు.

నేటి నుంచి రైల్వేగేట్ బంద్

- వాహనాల రాకపోకల దారి మళ్లింపు
- ఎస్ఐ అశోక్



పాణ్యం వద్ద ఉన్న రైల్వే గేటు

పాణ్యం: డబుల్ లైన్ పనుల నేపథ్యంలో బుధవారం పాణ్యం రైల్వేగేట్‌ను అధికారులు బంద్ చేయనున్నారు. పనులకు అంతరాయం కలుగకుండా గేట్ నుంచి రాకపోకలు జరగకుండా మూసివేస్తున్నారు. ఈ మేరకు వాహనాల రాకపోకలకు దారి మళ్లించామని, ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్ఐ అశోక్ మంగళవారం తెలిపారు. ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు గేటును మూసివేసి ట్రాక్ పనులు చేస్తారన్నారు. బనగానపల్లెకు వెళ్లే వాహనాలు కౌలురు మెట్ట వద్ద కౌలురు, భూపనపాడు, గోనవరం మీదుగా రాకపోకలు సాగుతాయన్నారు. బనగానపల్లె నుంచి నంద్యాల వచ్చే వాహనాలను గోనవరం వద్ద దారి మళ్లిస్తామన్నారు. రైల్వే అధికారులు వినతి మేరకు గేటు పనులకు ఇబ్బంది కలుగకుండా దారి మళ్లిస్తున్న ఈ మేరకు రాకపోకలు సాగించాలని వాహనచోదకులకు ఎస్ఐ సూచించారు.

ట్రాఫిక్ నియంత్రణ సర్కిల్ ఏర్పాటు చేయాలి



సంతకాల సేకరణ చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కల్లూరు: కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ట్రాఫిక్ నియంత్రణ సర్కిల్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీవైఎఫ్ఐ కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కల్లూరు చెన్నమ్మ సెంటర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నమ్మ సర్కిల్‌లో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య ఎక్కువైపోతుందన్నారు. చాలా సందర్భాలలో వాహనాలు స్తంభించిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే చెన్నమ్మ సర్కిల్ నుంచి ముజఫర్ నగర్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్, విక్రమ్, ఇమ్రాన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



బస్తిపాడు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: గ్రామ సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పుసులూరు, రెమడూరు, బస్తిపాడు, బొల్లవరం, తడకనపల్లె గ్రామాల్లో ఈఓఆర్డీ రవికిషోర్‌తో కలిసి ఎంపీడీఓ పర్యటించారు. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఒడీఎఫ్ సర్వేను పరిశీలించారు. అదేవిధంగా సచివాలయాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటిని, ఇంటి చుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై అనుమానాలు

కర్నూలు(అర్బన్): మంత్రాలయం మండలం రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని కురువ పార్వతిది ముమ్మాటికి హత్యేనని జిల్లా కురువ సంఘం నేతలు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ.. బాలిక శరీరంపై గాయాలున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గదిలో ఫ్యాన్ బాలికకు అందే పరిస్థితి లేకపోయినా ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాలిక తల్లిదండ్రులకు ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు బూదురు లక్ష్మన్న, కొత్తపల్లి దేవేంద్రం, మల్లికార్జున, వీరనాగప్ప ఉన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ పక్కీరప్ప

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించే పనుల కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీడీ పక్కీరప్ప సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కోడుమూరు ఉపాధి కార్యాలయంలో ఏపీఓ మోదీన్‌బాషా, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఏపీడీ మాట్లాడారు. హౌసింగ్ లబ్ధిదారులకు 90రోజుల పనిదినాల వేతనాలను చెల్లించాలన్నారు. ఉపాధి కింద పండ్ల తోటల సాగుకు ముందుకొచ్చిన రైతుల పొలాల్లో మొక్కలు నాటేందుకు పాదులు తీయించాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.